పారిపోడానికి ప్రయత్నం చేస్తున్నారు. రిక్షాలో దేనికైనా ఉపయోగపడుతుందని దాచిన బండ చాకు బయటికి తీశాను. ఆయన పరిగెత్తాడు. కానీ ఇసుకలో ఎక్కువదూరం పరిగెత్తలేక పోయాడు. వెంటబడి పట్టుకొని ఆ బండకత్తితోనే గుండెల్లో పొడిచాను. ఆయన ఖంగార్లో గభాల్న క్రిందబడ్డారు. గొంతుపిసికాను. అంతే! అయిపోయింది - అంతా అయిపోయింది! చేతులకు రక్తం అంటుకుంది. సముద్రంలో కడుక్కొని ఆ పెట్టె గుడిశెలోదాచి రిక్షా తీసుకుపోయి దాని యజమానికిచ్చేసి ఆ తెల్లవారుఝామునే బండెక్కాను. ఆ కేసులో వజ్రాలే వున్నాయి- అదీ ఈ ఆస్థంతా! నీకు సహాయం చెయ్యడానికి

చేసినా మిగిలింది మాత్రం ఇది.

వెళ్లిపోయేటప్పుడు ఒక్కటిమాత్రం చెప్పనీయి బాబూ! సంఘాన్ని ఎప్పుడూ నమ్మకు, పయోముఖ విషకుంభం! చేతనైతే దాన్ని నీ ఇష్టం వచ్చినట్లు ఆడించు-అంతే! పాపం అంటే నాకు నమ్మకంలేదు. కాని మానసిక వ్యధనించి తప్పించుకోలేక నీ సొత్తు నీకప్పగించి తేలిక పడతాను—వుంటాను. రామయ్య-"

రామారావు వుత్తరం పూర్తిచేసి సర్వభ్రష్టుడైనట్లు గభాల్న మంచందిగి తలుపులుతీసి "మహానుభావా! నాకింతటి దయాభిక్షా!" అంటూ ద్వారం వేపు చూచాడు. కాని అప్పటికే ఇంటి యజమాని ఇల్లుఖాళీ చేసి వెళ్ళిపోయాడు.

---

కథానిక

# డ్యూటీలో వీరాస్వామి

కాజ వెంకటశ్రీనివాసరావు

పోలీసు వీరాస్వామి టోపీ చేతులోకి తీసుకుని తన 375 నెంబరు తుడిచి తిరిగి తలమీద పెట్టుకున్నాడు. లాఠీని కుడిచేతిలోకి తీసుకున్నాడు. ఒడ్డూ పొడుగూ అజానుబాహువుగా ఉన్న శరీరానికి డ్రస్ సరిగా అమరిందో లేదో చూసుకుని సరి చేసుకున్నాడు. ఎదురుగా ఉన్న క్లాక్‌టవర్ చూశాడు. టైం ఆరూ నలభై అయిదు అయింది. రాత్రి మూడుగంటులు దాకా ఉంది డ్యూటీ. డ్యూటీ... డ్యూటీ... ఏంలాభం? రాత్రంతా కళ్లు కాయలుకాచేలా, కాళ్ళు అరిగేలా, ఒళ్ళు హూనం అయేలా తిరిగి బీటుకాస్తే, ఒక్క దొంగ అయినా దొరికితేనా! ఎలా దొరుకుతారు? ఈ మధ్య దొంగతనాలే తక్కువ అయాయి. అందులోనూ తనకి నెల రోజులనుండీ ఒక్క కేసయినా దొరకటంలేదు. కాని ఎస్. ఐ. ఊరుకుంటాడా? మరీ మండిపడుతున్నాడు ఒక్క కేసయినా పట్టుకోటం లేదని. ఉంటేగా పట్టుకోటానికి? ఏమయినా సరే పట్టుకోవాలంటాడు ఎస్. ఐ. తనకేం హాయిగా పడుకుని... ఒక రాత్రి అంతా బీటు వెయ్యమను తెలుస్తుంది!

ఇంతకీ ఎస్.ఐ.ని అంటే ఏం లాభం? అనాల్సింది ఆ వెంకటేశంగాడిని. ఓ కానిస్టేబుల్ అయాడుకదా అని, పది పిళ్ళనుండీ పనిచేస్తున్నా తనకి ప్రమోషన్ లేకపోగా, తన కళ్ళముందే చేరిన వెంకటేశంగాడు కానిస్టేబుల్ అయి కూర్చున్నాడు. అందుకే వాడికి అంత గర్వం. తనంటే అంత చులకనానూ. అడుగులకి మడుగులొత్తుతూ, ఏ ఎండకాగొడుగు పట్టి ఎస్.ఐ.ని లొంగదీసుకున్నాడు.

వెంకటేశంగాడు పోలీసు కానిస్టేబుల్ అని పేరేగాని నిజంగా వాడో దొంగ వెధవ. రిక్షా వాళ్లదగ్గర పావలా, బేడా లాగటంకూడా ఓ బ్రతుకేనా? పాపం! వాళ్ళు కష్టపడి రిక్షాలు లాగిలాగి ఓపావలో అర్థో సంపాదిస్తే దానిలోసగం లాగుతాడు. మళ్ళీ జట్కావాళ్ళదగ్గర లాగటానికి దమ్ముల్లేవు!

పల్లెటూళ్ళనుండి పనిమీద ఇద్దరు ముగురు

సైకిల్ మీద వొస్తేసరి వాళ్ళని పట్టుక పీడిస్తాడు. ఒకవేళ ఒక్కడే ఎక్కినా బ్రేకులు లేవనో, బెల్లు లేదనో వంకపెట్టి కాఫీకంటూ డబ్బులు గుంజుతాడు. నిజంగా కాఫీకి డబ్బు చెల్లిస్తున్నట్టు! కాకా హోటల్లో బోండాలూ, కాఫీలూ ఫ్రీగానే ఎక్కిస్తాడే!

పైగా రిక్షావాళ్ల దగ్గరా, వీళ్ళదగ్గరా లంచం తీసుకోలేదని తనని అంటాడు. తను అటువంటిపని ఎప్పటికీ చెయ్యనంటే ఎంత వికృతంగా నవ్వేడు వెంకటేశం! వాడు నవ్వి ఊరుకున్నా పోయేది. ప్రక్కనున్న తనలాంటి పోలీసోళ్లు ఎందుకంట పకలబడి నవ్వటం? వాళ్ళందర్నీ లొంగదీసుకున్నాడు వెంకటేశంగాడు. అందుకనే ఆ వెధవలెప్పుడూ వాడినే సైడు చేస్తారు. తనంటే ఎంత అలుసు వాళ్ళందరికీనూ! తను ఏం మాట్లాడినా సరే, దొంగవెధవలు పకపకా నవ్వుతారు.

మొన్నటికి మొన్న! ఆ వెంకటేశం ఎంత పరాభవం చేశాడు తనకి? ఏదో కొత్త సినీమా తగలబడిందిట. ప్రేక్షకులని సర్దటానికంటూ ఓ పిలుపు పారేశారు పోలీస్టేషనుకి వెంకటేశం తననీ తీసుకెళ్ళాడు అందరితోపాటూ. ఏం చేశాడేం అక్కడ వెంకటేశం? బయట తను కష్టపడుతూంటే లోపల మిగిలినవాళ్ళతో హాయిగా సినీమా చూస్తాడా? తను ఎంత కష్టపడ్డాడు వాళ్ళని సర్దటానికి. ఆ పావలా టిక్కెట్టు వాళ్ళతో మరీ గొడవ వొచ్చి పడింది. లాఠీతో మోదినా లైన్లో నిల్చోరు. ఒకళ్ళ తలమీద ఒకళ్లు ఎక్కి తమే ముందు టిక్కెట్టు తీసుకోవాలని చూస్తారు చస్తారేమిటి మొదటిరోజే సినిమా చూడకపోతే!

వెంకటేశంగాడు ఎంత మోసకారి కాకపోతే ఆ ఎస్. ఐ ని బుట్టలో వేసుకుంటాడు! నిజానికి ఎస్. ఐ. మంచివాడే. కాని ఏంలాభం? వెంకటేశంగాడు చెప్పినట్టే చేస్తాడు. వాడి చేతిలో కీలుబొమ్మ వాడు ఆడింది ఆట. పాడిందిపాట. ఎస్. ఐ. ని బుట్టలో వేసుకునేగా తననెప్పుడూ నైట్ డ్యూటీలు వేయిస్తున్నాడు? వాళ్ళకి తనొక్కడే మెతగ్గా కనపడ్డాడు కాబోలు. అవునులే! మెత్తనివాళ్ళనిచూస్తే ఎవరికైనా మొత్తబుద్ధేస్తుందంటారు. అయినా తనెందుకు అంత మెతగ్గా ఉండటం? తనుకూడా నమ్మించి గొంతుకోసే మోసకారిగా మారితే ఈపాటికి ఆ వెంకటేశంగాడికంటే ముందుగా కానిస్టేబుల్ అయిపోయేవాడు కదూ? అప్పుడు వెంకటేశంగాడు తనకింద బానిసలాపడి ఉండేవాడేమో? ఆ వెంకటేశాన్ని సైడుచేసి వెధవలంతా తన కాళ్ళు పట్టుకోరూ? తనుమాత్రం ఎందుకు లంచాలు తీసుకోకూడదు? తీసుకుంటే వచ్చేనష్టం ఏమిటి? ఈ కాలంలో పెద్దపెద్దవాళ్ళే లంచాలు తీసుకుంటూంటే? అవును! తనూ రేపటినుంచీ మొదలు పెడ్తాడు—లంచాలు తీసుకోటం, అందరిలాగే తనూ మోసంచేస్తాడు, రిక్షావాళ్ళదగ్గర డబ్బు గుంజుతాడు, దొంగతనంగా సారాయి తీసుకెళ్ళేవాళ్ళదగ్గర డబ్బు లాగటంకాకుండా సారా కూడ తీసుకుంటాడు...

ఛీ......ఛీ...... తనెప్పుడూ అటువంటి లంచగొండీలకి లొంగి ఉండకూడదు. రిక్షాలాగే వాళ్ళ కష్టాలు తెలిసికూడా తను వాళ్ళదగ్గర డబ్బు గుంజుతాడా? కలలో మాట. తనంత హృదయంలేనివాడా? నిజంగా తను అటువంటివాడయితే ఆ వెంకటేశంలా ఈ పాటికి ఇల్లు కట్టించి ఉండేవాడు కదూ? కాని తనెప్పుడూ అలా చెయ్యడు. తను న్యాయానికి కట్టుబడి న్యాయంకోసం పని చేస్తాడు. ఎప్పుడో ఓరోజు ఈ లంచగొండి లందరికీ పతనం తప్పదు.

వీరాస్వామి మెదడులో ఆలోచనా పరంపరలు ఎంతకీ తెగటంలేదు. నిజం చెప్పాలంటే అతడు అమాయకుడే, మెత్తనివాడు. గత జీవితాన్ని తలచుకుని ఎప్పుడూ బాధపడతాడు. వర్తమానాన్ని నిర్లక్ష్యంచేస్తాడు. భవిష్యత్తు గూర్చి కలలుకంటూ గాలిమేడలు కట్టుకోటం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు...

ఆలోచిస్తూ నడుస్తున్నాడు వీరాస్వామి. తను ఎటు వెళుతున్నాడో, ఏ ఉద్దేశంలో వెళుతున్నాడో తెలుసుకోలేక పోతున్నాడు. అతను అలా నడవటానికి కారణం ఆలోచించుకోటం లేదు. ఎందుకాలోచించుకోవాలి? ఆ వెంకటేశంగాడే నిర్ణయించాడు ఈ రాత్రి తనకుగల భవిష్యత్తు. అంతా నిద్రపోతున్నా, తనుమాత్రం

మేలుకుని దేశ దిమ్మరిలా రోడ్లన్నీ తిరుగుతూండాలి. దాన్ని తెలుగులో పహారా అనో, పారా అనో, గస్తీ అనో, మరింకేమంటారో తనకి తెలీదు. కాని తనకు తెలిసిందల్లా అది తన డ్యూటీ. నెత్తిమీద టోపీ పెట్టుకుని, లాఠీ చేతిలో ఉంచుకుని తిరుగుతూండాలి రోడ్లన్నీ.

నడిచినడిచి వీరాస్వామి కాళ్ళు నొప్పి పుట్టాయి. ఒక కిల్లీకొట్టు ప్రక్కన ఉన్న ఓ బెంచీమీద కూలబడ్డాడు వీరాస్వామి. టైం ఎంతయిందో అని ప్రక్కనున్న హోటలుగడియారంలోకి తొంగి చూశాడు. కళ్ళే అవసరంలేదు. చెవులుంటే చాలు అన్నట్టు ఆ గడియారం ఎనిమిది కొట్టింది. చుట్టూ బాగా చీకటిపడింది. రోడ్డు మీద ఉన్న మున్సిపల్ ఎలక్ట్రిక్ దీపాలు ఆధారం కళ్లు కనపడటానికి.

వీరాస్వామి బీడీ వెలిగించేలోపలే దగ్గరిలో పిల్లలు గోలచేస్తూండటం వినిపించింది. ఓ కుక్క మొరుగుతూంది. పిల్లలు దానిమీద రాళ్లు రువ్వటము మసగ్గా కనిపించింది వీరాస్వామికి. వీరాస్వామి విసుక్కున్నాడు. వెధవది ఎక్కడచూసినా గోలే! ఈ బస్తీ అంతా ఇంతే! ఆ పిల్లలకే పోయే కాలం? తిని చదువుకో కూడదూ - అలా కుక్కని కొట్టకపోతే? పోనీ కుక్కని కొట్టారనుకున్నా ఆ వెధవ కుక్క అలా మొరుగుతుందేం పారిపోక? విసుక్కుంటూనే బీడీ కాలుస్తున్నాడు వీరాస్వామి. గోల ఇంకా పెరిగింది. ఆపిల్లలు కుక్క మీద రాళ్ళు వెయ్యటం మానలేదు, ఆ కుక్క మొరగటం అంతకన్నా మానటంలేదు. వీరాస్వామికి పెద్దకోపం వచ్చింది. ఆ కుక్కనీ, పిల్లల్నీ కూడా లాఠీతో చావకొడదామనుకున్నాడు.

కిల్లీకొట్టు ఆసామీ తమలపాకులకి సున్నం రాస్తూ ఆ కుక్కవేపు దృష్టి పోనిచ్చాడు. ఆశ్చర్యంతో వీరాస్వామివేపు తిరిగిఅన్నాడు: "అదేమిటయ్యా పోలీసూ? ఆ పిల్లలు కుక్కని అలాగా కొడ్తుంటే చూస్తూ ఊరుకున్నావు? అది మీ డి. ఎస్. పి గారి కుక్కలాగుంది."

వీరాస్వామి ఉలిక్కిపడ్డాడు. నోటిలో బీడీ క్రిందపడిపోయింది. కొంపదీసి అది డి ఎస్. పి గారి కుక్కేమో! వెంటనే లేచి లాఠీ పుచ్చుకుని ఆ కుక్కదగ్గరి కెళ్ళాడు. లాఠీ తిప్పుతూ ఒక్కసారి గర్జించాడు. ఆ పిల్లలు భయపడి పారిపోయారు. ఆ కుక్క చెవిపట్టుకుని లాక్కువచ్చాడు కిల్లీకొట్టు ముందుకి లైటు వెలుతురులో కుక్క బాగా కనిపిస్తుంది. అది అంత పెద్దకుక్క కాదు. కొట్టు ఆసామీ తన అభిప్రాయాని బలపరిచాడు. "అది డి. ఎస్. పి గారి కుక్కేనయ్యా! నాకు బాగా తెలుసు. ఆయనకి ఇటువంటి బొచ్చుకుక్క ఉంది."

నిజమే అనుకున్నాడు వీరాస్వామి. కుక్కచాలా బావుంది కూడాను. అది డి.ఎస్.పి గారిదే అయి ఉంటుంది. కాలేజిలో చదివే డి. ఎస్. పి గారి అమ్మాయికి కుక్కలంటే ఇష్టంట. ఇప్పుడూ వాడితో ఆడుకుంటుందిట. డి.ఎస్.పి గారికికూడ కుక్కలంటే యిష్టమేను. మెళ్ళోగొలుసు కూడ ఉంది. తప్పకుండా పెంపుడు కుక్కే. అరె! పాపం దీని ఒంటిమీద గాయం తగిలి రక్తం కారుతుందే! ఆకతాయివెధవలు! అన్యాయంగా దీన్ని రాళ్లతో కొట్టారు. ఇది డి.ఎస్.పి గారిదని తెలిస్తే తను కొట్టనిచ్చేవాడేనా? అసలు ఈకుక్క యెలా తప్పించుక వచ్చిందో? ఆలోచించుకుంటూనే కుక్క గొలుసు పుచ్చుకుని డి. ఎస్. పి గారి బంగ్లాకి బయలుదేరాడు వీరాస్వామి.

వీరాస్వామి మనస్సులో ఓ ఆలోచన తళుక్కుమని మెరిసింది, పెదిమలమీద చిరునవ్వు నాట్యం చేసింది. ముఖం విప్పారింది. ఇప్పుడు తను ఈ కుక్కని పట్టుకవెళ్ళి డి. ఎస్. పి గారి కప్పచెప్పితే ఎంతో సంతోషిస్తారు. దాని ప్రాణాన్ని కాపాడినందుకు తనను మెచ్చుకుని తనకి ప్రమోషన్ ఇప్పిస్తారు.

ఈ మధ్య డి. ఎస్. పి గారు వెంకటేశాన్ని కోపంవచ్చి ఎందుకో శిక్షలేశారుట. ఆ కోపం మీద వెంకటేశాన్ని దించేసి ఆ ప్లేసు తనకిచ్చెయ్యవచ్చు. తమ బాచ్‌లో అందరికంటే తనే సీనియరు. తను వెంకటేశానికి పైవాడవుతాడు. ఇక వెంకటేశం ఆటలు సాగవు. తను అంటే భయపడాలి. తాను చెప్పినట్లు చెయ్యాలి. మిగిలిన వెధవలు తనంటే భయపడి చస్తారు. ఆ వెంకటేశంగాడికి తగిన శాస్తి జరగాలి. వాడిని ప్రతిరోజూ నైట్ డ్యూటీకి వేయించాలి. అప్పుడు

గాని వెధవకి తెలిసిరాదు తనెంతో కష్టపడ్డాడో! ఎస్.ఐ. ఈమాటు తనమీదవిసుక్కాడు. నిజంగా ఈ కుక్కవల్లేగా తనకి అదృష్టం పట్టపోతూంది. ఈ కుక్క తప్పించుకుపోవటం మంచిదే అయింది.

ఈ ఆలోచన రాగానే వీరాస్వామికి కుక్క మీద ఎంతో ప్రేమ పుట్టుకొచ్చింది. అందాకా నడిపిస్తున్న వాడల్లా ఆ కుక్కని రెండుచేతులతో ఎత్తుకున్నాడు. గాయం తగిలి మూలుగుతున్న ఆ కుక్కని చూడగానే తనకి ఎంతో బాధ కలిగింది. గాయం తనకే తగిలినట్లనిపించింది.

డి. ఎస్. పి గారి బంగ్లా చేరాడు. డి. ఎస్. పి గారికి కబురెళ్లింది తనకుక్క తిరిగి వొచ్చినట్లు. ఆయన ఒక్క పరుగుమీద బంగ్లాగేటు దగ్గరికి వచ్చారు సంతోషంతో. డి.ఎస్.పి గారి సంతోషంచూసి వీరాస్వామి సంతోషించసాగాడు- డి. ఎస్. పి గారు ఎంతో మెచ్చుకుంటారని.

డి. ఎస్. పి. గారు కుక్క జుట్టు నిముకుతూ ఉన్నారు. ఆ కుక్క బాధతో మూలగసాగింది. దాని వీపుమీద ఉన్న గాయం చూసేసరికి ఆయనకి ఆశ్చర్యమేసింది. తనకుక్కని గాయపరచిందెవరా అని. వీరాస్వామి చెప్పుకుపోతున్నాడు. "ట్రాన్ హాన్ దగ్గర కూర్చున్నానండీ! ఎవరో కుక్కని కొడుతున్నట్లు చూశాను. చిన్నపిల్లలు రాళ్ళు రువ్వుతున్నారు కుక్కమీద. మొదట ఏదో వీధికుక్కగదాఅని ఊరుకున్నాను. ప్రక్కనున్నాయన మీదని చెప్పగానే ఆ పిల్లల్ని అదలించి కుక్కని ఎత్తుకొచ్చి..."

మాట పూర్తి చెయ్యక ముందే డి. ఎస్. పి గారు కోపంతో అన్నారు. "షటప్! రాస్కెల్ పిల్లలు కొడుతూంటే చూస్తూ ఊరుకున్నావా వీధికుక్క అనుకుని? ఎంతగాయం చేశారో వెధవలు. నువ్వుముందే కలుగచేసికొంటే ఈ గాయం తగిలేదికాదుగా? పైగాబుద్ధిలేకుండా చెప్తున్నావు. గెటువుట్! రాస్కెల్"

డి. ఎస్. పి గారి కోపంచూసి వీరాస్వామి భయంతో ఒణికిపోయాడు. తను ఊహించినట్లు జరగనందుకు బయటికివస్తూ విచారించ సాగాడు. తనెన్ని కలలు కన్నాడు కుక్కనితెస్తూ! ప్రమోషన్ వస్తుందని ఆశించి ఆ కుక్కని తెచ్చాడే! వెధవ కుక్క అనవసరంగా తనకీవేళ తిట్లు తెచ్చింది. ఇంకానయం ఉద్యోగం ఊడదీస్తానన లేదు. ఇవ్వాళ వెధవరోజు. ప్రొద్దున్నే లేచి ఎవరి ముఖంచూశాడో తను అనుకున్నాడు. ప్రొద్దున్నే లేవంగానే తనకి కనపడింది నవ్వుతూ ఆ వేపున పోతూన్న వెంకటేశం అని గుర్తుకు తెచ్చుకున్నాడు వీరాస్వామి.

వెంకటేశాన్ని తిట్టుకుంటూ తిరిగి తన డ్యూటీలో ప్రవేశించాడు వీరాస్వామి.

---

## ఉన్నమాట

పన్యాల

అవును- నాకేక దూరపువాక
అర్థాలు లేక-
అనంత దురంతాల పరిధిలో రాక
అవును- నా సూక్తి సమస్తాల శక్తి
ఆనంద రక్తి-
అశేష విశేష జనాళికే ముక్తి
అవును- నా పాట మౌనాల వేట
అందించు బాట-
అజేయ విజేయ నిజాలకు కోట
అవును- నా శాంతి విశ్వాస భ్రాంతి
ఆరాధ్య కాంతి-
అమర్త్యసుమాల కవిత్వ స్రవంతి